**తాము సత్యవంతులమని అమాయకుల్ని నమ్మించి, తడిబట్టతో గొంతులు కోసే వాళ్ళుంటారు. తస్మాత్ జాగ్రత్త!**

క్లాసంతా గలభాగా వుంది. మాష్టారింకా రాలేదేమిటి? పిల్లల ఆత్రం. రారేమో? రాకపోతే హాయిగా ఇంటికి వెళ్ళిపోవచ్చనే ఉబలాటంతో వున్నారు. కొందరు బయటికి వెళ్ళి చూడ్డం మొదలుపెట్టారు.

వెళ్ళిన వాళ్ళంతా గబగబా క్లాసుకి తిరిగి వస్తూండడంచూసి కూర్చుని గోలచేస్తున్న వాళ్ళంతా మాష్టారు వచ్చేస్తుండచ్చు అనుకుని బుద్ధిమంతుల్లాగా పుస్తకాలకేసి చూస్తూ చదువుతున్నట్లు నటిస్తున్నారు.

వచ్చేశారు. వచ్చేశారు. గుసగుస. అంతా నిశ్శబ్దం. అటెండెన్సు ప్లీజ్. నెక్స్ట్.

"ఒరేయ్ రమణా హోమ్‌వర్క్ బుక్ పట్రా. చేశావా?" రమణ వొణుకుతూ నోట్సు తీసికెళ్ళాడు. "ఇది నీ దస్తూరీ కాదు. అవునా?" రమణ చెవుల్లో పిడుగులు పడ్డాయ్. అమాయకంగా లేత తమలపాకులా వున్న రమణ మొహం భయంతో నల్లబడిపోయింది. తర్వాత మేఘాలుగర్జించాయో, మాష్టారు యేమన్నా అంటున్నారో రమణకి తెలీలేదు. "అసలు చెయ్యకపోయినా పరవాలేదుగానీ, ఎవరి చేతో చేయించి నువ్వే చేసినట్లు తీసుకొస్తావురా. దొంగవెధవా. చూడు తాట వలిచేస్తాను, సత్యం మాష్టారంటే, మజాకా అనుకున్నావేమో, నా దగ్గర అబద్ధాలాడి ఏ వెధవా తప్పించుకోలేదు. వేలెడు లేవు. ఇప్పట్నుంచీ నీకు అబద్ధాలు, మోసాలూనా - ఊఁ చెయ్యిచాపు, ఒకటీ.... మూడూ" స్కేలు ప్రసాదించిన దెబ్బలతో లేత గులాబీలా వున్న రమణ అరచెయ్యి ఎఱ్ఱగా ముద్దమందారంలా మారింది.

గుడ్ల నీళ్ళుకుక్కుకుంటూ వచ్చే ఎక్కిళ్ళను బలవంతాన ఆపుకుంటూ వెళ్ళి బెంచీమీద కూర్చున్నాడు. చొక్కాతో కళ్ళూ, ముక్కూ తుడుచుకుని. తనే రాసినా నిజం చెప్పి ఒప్పించలేక శిక్ష అనుభవించాడు రమణ. సత్యం మాష్టారింకా ఆవేశంగానే వున్నారు. "ఒరేయ్ అసలుమీకు ముందు నేర్పవలసింది చదువు కాదురా, మంచి నడవడి. జీవితంలో సత్యానికి ఎక్కువ ప్రాధాన్యత నివ్వాలి. సత్యం అంటే ఏమిటి?" "నిజం సార్." ఎన్నో గొంతుకలు. "నిజం అంటే? అబద్ధంకానిదంతా నిజంకిందకే వస్తుంది. అసలు అబద్ధమంటే? అ - బద్ధం - కట్టుబడనిది. దేనిచేత? నిజంచేత. అంటే నిజంచేత కట్టుబడనిది అంతా అబద్ధమే. మన పూర్వీకులు సత్యం శివం సుందరం అన్నారు. సత్యాన్ని పరబ్రహ్మ స్వరూపంగా చెప్పారు. ఎన్ని కష్టాలు వచ్చినా సత్యవాక్య పరిపాలన చేసిన హరిశ్చంద్రుణ్ణి మనం ఆదర్శంగా పెట్టుకోవాలి. అబద్ధం చెప్పాలంటే ప్రాణం పోతున్నంత బాధ కలగాలి. ప్రాణం పోతున్నా సత్యమే చెప్పాలి. ఈనాటి నుంచీ మీరెవ్వరూ అబద్ధం చెప్పరాదు. చెప్పినట్లు తెలిసిందో నాలుక చీరేస్తా."


సత్యం మాష్టారి క్లాసుకొంచెం అటూ, ఇటూగా రోజూ ఇలాగే వుంటుంది. మూడొంతులటైమ్ పిల్లలకి సత్యవాక్య పరిపాలన గురించే బోధిస్తారు. అందుకే హెడ్‌మాష్టారి దగ్గర్నించి ఊళ్ళో పెద్దలందరికీ ఆయనంటే తగని గౌరవం. ఎవరితో మాట్లాడినా, సత్యం, సత్యం అంటూ సత్యజపం చేస్తూ వుంటారు. అందుకే ఆయన అసలుపేరు రామారావయినా సత్యం మాష్టారనే వాడుకయిపోయింది. రామారావుగారంటే ఆయన చుట్టుపక్కల వాళ్ళుకూడా యెవరో మాకు తెలీదంటారు. అంతలా ఆయనకి ఖ్యాతి వ్యాపించిపోయింది. సత్యం మాష్టారని పిలిపించుకోడం ఆయనకెంతో యిష్టం. కూడాను. జన్మ ధన్యమయినట్లే భావిస్తారు.

"ఏమేవ్ జానకీ టిఫినేదైనా వుందా? లేదా?"

"ఇంటికొస్తూనే ఏమిటా గావుకేకలు. ఇదేం స్కూలనుకున్నారా" ఒక్క కసురుతో పులిలాంటి మాష్టార్ని పిల్లిలా మార్చేసిన ఘనత దక్కించుకుంది సత్యం మాష్టారి సతీమణి శ్రీమతి జానకి. దొడ్లో ఏదో యుద్ధం జరుగుతున్న సూచనలు కన్పిస్తున్నాయి. కొంగు దోపుకుని రయ్యిన వీరనారిలా వెళ్ళింది జానకి. "నీ అబద్ధాలు మండిపోనూ. తిని లేదంటావేమే. మొన్న మా సీత పుట్టిన రోజున స్టీలు గిన్నెతో పాయసం ఇవ్వలేదుటే?"

"నా నెరగనమ్మగారు. మీ పాయసం తిన్నదాన్నైతే నా పాపం నేనే అనుభగిస్తాను."

"నీ పాపంతో, పుణ్యంతో నాకు



పనిలేమ. నా స్టీలుగిన్నె తెస్తేనే పనిలోకిరా. లేకపోతే లేదు'

రంగి లబ్బున గోల పెట్టింది. "మీ గిన్నె నే తీసుకెళ్ళ లేదమ్మగారు. నా కానాడు పాయసం కూడా యివ్వలేదు. ఇంట్లోనే ఏమూలో వుంటుంది. సరింగా యెనకండి"

"ఎంత వొళ్ళు పొగరు గిన్నె తీస్కెళ్ళి లేదంటానికి?" జానకి విసురు.

"ఇదిగో ఏవమ్మో పొగరు గిగరు అన మాక నీ గిన్నె నాకాడలేదు. ఇష్టమైతే పని



# సత్యానిర్ణయం

డి. శ్యామలాదేవి

చేయించుకోగాని దొంగతనం అంటకడితే పడేదిలేదు" దోపినకొంగు విసురుగా బొడ్డుటికి లాగి ఒక్కదుటు పుదులిపి పక్కింటి వన్లోకి పోయిందిరంగి. ముందు వేపుకి జానకమ్మ వెళ్ళి పిలిచింది "కామాక్షీ! కమలా!" అంటూ. "చూశావా రంగిముండ పొగరు."

"మొద్దులాంటి స్టీలు గిన్నె తీసికెళ్ళి లేదని దబాయిస్తోంది."

"అవును మేమూ విన్నాం మీ మాటలు" కామాక్షి అంది.

"ఇల్లంతా వెతికావా వదినా" కమల సంశయంగా అంది.

"భలే దానివి నేనంత ఒళ్లుపై తెలీని దాన్ని కాదు." కమలమీద విసురు విసిరింది. కమల అజాగ్రత్తగా వుంటుంది. తన్నిపరోక్షంగా అంటమే అని కమల చిన్నబుచ్చుకుంది.

"ఏమైనా దానిచేత పని చేయించుకుంటే వెయ్యికళ్ళతో మీ సామాన్లు కాపాడుకోండి." ఉచిత సలహా పారేసి వెళ్ళిపోయింది జానకి.

"నిజమేనంటావా కామాక్షీ." కమల అనుమానం వెలిబుచ్చింది.

"ఎంత పిచ్చిదానివి కమలా? జానకమ్మొదిన హాస్యానికికూడా అబద్ధమాడదుట. ఎప్పుడైనా తమాషాకి చిన్న అసత్యం చెప్పినా వొళ్ళంతా మంటలెత్తుతుందట. మాష్టారు సరేసరి. సత్యానికి మారుపేరు. ఇదంతా వాళ్ళ ఇలవేలుపైన సత్యనారాయణుడి మహత్యం"



వెలుగు ఏ దీపంనుంచి వచ్చినా చీకటిని తొలగిస్తుంది. గులాబి ఏ తోటలో వికసించినా ఆనందం కలిగిస్తుంది.

—రాధాకృష్ణన్

* * *

శ్రాద్ధం పెట్టగానే చనిపోయినవారు తృప్తి చెందడం నిజమైతే, నూనె పొయ్యగానే ఆరిపోయిన దీపం వెలగాలి కదా!

—ప్రబోధ చంద్రోదయం

* * *

వాంఛ ఒక్క నిమిషంలో చల్లారే చిన్న వేడి. ప్రేమ జీవితాన్నంతా వెలిగించే విద్యుచ్ఛక్తి.

—చలం

* * *

చేసేవాడు, చేయించేవాడు, ప్రేరేపించువాడు, ఆమోదించువాడు—ఈ నలుగురున్నూ పాపపుణ్యకార్యాల్లో భాగస్వాములే.

—పంచతంత్రం

* * *

సమయోచితమైన పలుకు, స్వభావోచితమైన పని, తన శక్తికి తగిన కోపం తెలిసి ప్రవర్తించువాడే పండితుడు.

—హితోపదేశం

* * *

తిరుగుబాటులేని జీవితం, వసంతం లేని ఋతువలయం. కట్టుబాటులేని తిరుగుబాటు ఒట్టి ఎడారిలో వసంతోదయం.

—ఖలీల్ జిబ్రాన్

* * *

ప్రశ్నించేవాడికంటే విశ్వసించేవాడే సుఖపడతాడనడం మామూలు స్థితిలో వున్నవాడికంటె మత్తులో వున్నవాడు హాయిగా వుంటాడనడంలాంటిది.

—బెర్నార్డ్ షా

సేకరణ:

ఈదుపల్లి సుగుణాదేవి, ఏలూరు

"సరేలే. వాళ్ళ సత్యాలతో మనకేం పనిగాని రంగిని మానిపిస్తే, అంత శుభ్రంగా చేసే మనిషి మళ్ళీ కుదురుతుందా? నీకు పరవాలేదు. మీ పిల్లలు సాయం చేస్తారు. నేను చిన్న పిల్లలతో చేసుకోలేను." కమల రంగిని మాన్పించడం ఇష్టంలేనట్లే మాట్లాడింది.

"అయినాసరే తప్పదు కమలా. దొంగదాన్ని ఇంట్లో వుంచుకుంటామా? వెనకటి కెవడో దొంగకి తాళాలిచ్చాట్ట."

మూడిళ్ళలో పని వొక్కసారి పోగొట్టుకుని పొట్టగడిచే మార్గం కనపడక వుసూరుమంటూ శాపనార్థాలు పెడుతోంది రంగి. కమలకి రంగిని చూస్తే జాలేసింది. దాని కళ్ళలో అమాయకత్వం, నిర్దోషిత్వమూ వున్నాయనుకుంది.

గిన్నెకాజేస్తే వన్నొంచి తీసేస్తారని దానికి తెలీదా? తెలిసీ దానిపొట్ట అదే కొట్టుకుంటుందా? తను డబ్బులు ఎక్కడ పడితే అక్కడేపెట్టి మర్చిపోతూంటుంది. ఇల్లూడుస్తుంటే రోజూ దానికి ఎంతో కొంతడబ్బు దొరకాల్సిందే. "ఏంటమ్మగోరూ లచ్చిమివి లచ్చెం లేకుండా ఏడపడితే ఆడ పడేస్తారు." అంటూ నవ్వుతూ తెచ్చిచ్చేది. ఏమైనా, ఏది నిజం? ఏది అబద్ధం? అనేది తేల్చడం చాలా కష్టం. అందుకు సంబంధించిన ఇద్దరు వ్యక్తులకే సత్యం తెలుస్తుంది. అయినా ఎవరి వాదనను వాళ్ళు సాగిస్తారుగాని లొంగిపోరు. "సత్య నిర్ణయం" భగవంతుడే చెయ్యాలి. రంగికి కొత్త పని దొరకటం కష్టం. అందులో దొంగ అని ముద్ర పడిందికదా! తాగుబోతు మొగుడితో ఆరుగురు పిల్లల్నెలా సాకుతుందో! ఎవరూ చూడకుండా పది రూపాయలు రంగి చేతిలో పెట్టింది కమల.

"కమలా సత్యంమాష్టారు మొన్న వంద రూపాయలు తీసుకున్నారని చెప్పావుకాదూ?" శేఖర్ రహస్యంగా అడిగాడు. "అవునండీ చెప్పినట్లేవున్నారు" కాఫీ అందిస్తూ అంది. "ఇవాళ ఫస్టుగదా" ఇదిగో శేఖర్ మొన్న నీ దగ్గర తీసుకున్న ఏభై రూపాయలూ." అంటూ ఏభై రూపాయలనోటు చేతులో పెట్టారు." అన్నాడు కాఫీ సిప్ చేస్తూ.

"ఏంవిటీ సత్యం మాష్టారే?"అసలే పెదవైన కళ్ళన్ను ఆశ్చర్యంతో మరింత పెద్దవి చేస్తూ అంది కమల. "ఊరుకో కమలా యెవరితోనూ అనకు. నాకు పూర్తిగా గుర్తులేదు. ఏభయ్యేఇచ్చి వంద యిచ్చాననుకున్నానేమో?"

"సత్యం మేష్టారు అబద్ధం ఆడతారా ఈమధ్య మీకు మతిమరుపు ఎక్కువౌతోంది." అంది కమల.

"నిజం నిజం సత్యం మాష్టారినోట అసత్యం చెప్పిస్తే పదివేలిస్తానని వెనకటి కెవరో పందెం కాశారుట" అన్నాడు శేఖర్.

"నేను మాత్రం కాదు బాబూ." కమల హాస్యంగాఅండంతో ముక్కుపట్టి లాగాడు శేఖర్ "నాకు బోల్డంతపనుందిబాబూ.రంగి మానేసింది. అంట్లు కూడా తోముకోవాలి. మీతో భేటీ వేసుకునేందుకు నాకు తీరిక లేదు," అంది.

"అదేం రంగి ఎందుకు మానేసింది, ఎంతోమంచిది నిలకడగాచేస్తుంది. అన్నావుగదా," అన్నాడు శేఖర్. కథంతా చెప్పింది. ఎక్కడో ఏదో అర్థమయ్యీ కానట్లనిపించింది శేఖర్‌కి.

ఆ పెంకుటింట్లో మూడు కాపురాలు: సత్యం మాష్టారు జానకమ్మ, అయిదుగురు సంతానం పెద్ద వాటాలో వుంటున్నారు. కామాక్షీ,విశ్వనాథం, వాళ్ళిద్దరు పిల్లలూ ఒక వాటాలో. కమలా, శేఖర్, వాళ్ళ ముగ్గురుపిల్లలూ చివరి వాటాలో వుంటున్నారు. శేఖర్‌కి బ్యాంకులోవుద్యోగం. ఆ మూడు వాటాల్లోకి ఆర్థికంగా, వున్నతంగా వున్నాడు. ఇదీ ఆ యింటి సంగతి. మూడు వాటాలవాళ్ళూ సఖ్యంగానే వుంటారు. కమలా, కామాక్షీ యించుమించు ఒకే వయసు వాళ్ళవటంచేత మరీ స్నేహంగా, ఆత్మీయంగా వుంటారు. ఇంక పిల్లల సంగతి చెప్పనే అక్కర్లేదు. బడికెళ్ళిన సమయంలోతప్ప మొత్తం పదిమంది పిల్లలూ ఏదో ఒక ఆటో, పాటో, కబుర్లో, సరదాగా వుంటారు.

కామాక్షి జానకమ్మ వాటాలోకి వెళ్ళింది. ఇంతలోనే కమలా వచ్చింది "ఏం చేస్తున్నావు వదినా?" అంటూ. "చూశావా కామాక్షీ!రంగి అవతల వీధిలో సుబ్బమ్మగారింట్లో పనికి కుదిరిందిట. ఇందాక పిల్లలు చెపితే వెళ్ళాను."

"నీ చాదస్తంగాని ఎక్కడా పనిలోకి కుదరక ఛస్తుందా" అంది కామాక్షి.

"ఎంతయినామన వాళ్లు గదా చూస్తూ చూస్తూ దొంగ దాన్నింట్లోకి పెట్టుకున్నారంటే చెప్పద్దూ మనసు కొట్టుకుపోయిందనుకో. అదేం ఖర్మమోగాని యెవరికైనా అన్యాయం జరిగితే పాడుమనసు గిలగిల్లాడిపోతుంది. నాకెందుకులే అనుకోబుద్ధవదు. ఉన్నమాట చెప్పేశాను. "మీ యిష్టం సుబ్బమ్మక్కా.

దాన్ని పని మాన్పించకండి దానినోటికాడ కూడు పడగొట్టిన పాపం నా కెందుకుగాని ఓ కంట కనిపెట్టండి."అన్నాను."అయినా సుబ్బమ్మక్క విన్లేదు. వెంటనే రంగికి ఉద్వాసన చెప్పేసింది." ముసి ముసిగా నవ్వుతూ చెప్పింది జానకి.

"అయ్యో వదినా. ఎంత పనిచేశావు. ఆరుగురిపిల్లల పొట్టనింప లేకనేకదా పాచి పని చేస్తోంది. ఇలా అని తెలిస్తే దానికి పనెవరిస్తారు?" కమల బాధగా అంది. జానకమ్మ కోపంతో బుస్సుమంది."అబ్బో ఎంత జాలిగుండె. అలాటప్పుడు నువ్వా ఎందుకు తీసేశావు". కమల తెల్లమొహం వేసింది.

"గిన్నె తీసికెళ్ళి లేదని చెపుతోందే ఏ పాపాన పోతుందోగాని. నీలాంటి వాళ్ళ అలుసు చూసుకునే అలా చేస్తారు;" కమల కేసి ఛీత్కారంగా చూస్తుండగానే సీత గిన్నె చేత్తో పట్టుకుని వచ్చింది.

"అమ్మా ఈ గిన్నేనా రంగి ఎత్తుకు పోయిందన్నావు. కావిడిపెట్లో...." మాట పూర్తి కాకుండానే జడపట్టుకుని వంగదీసి వీపు మీద ఒక్కగుద్దు దబీమని వేసింది.'వెధవకానా నీకనవసరమైనవిలేవు' అంటూ యెడాపెడా ఒక తిట్టూ ఒక కొట్టూగా బాత్తూవుంటే కామాక్షి మెల్లగా యెప్పుడు జారుకుందో. "చిన్నపిల్ల చచ్చిపోతుంది. నీ అఘాయిత్యంకూలా" అంటూ కమల పిల్ల నివతలకి విడిపించుకు వచ్చింది.

"ఈ గిన్నెకాదు కమలా అది తీసుకుంది మైసూరుగిన్నె. చూశావా వదిన దాచుకుని పోయిందంటోంది అని అనుకుంటారేమోనని సిగ్గుతో చచ్చిపోతున్నాననుకో.""ఎంతమాటన్నావువదినా నువ్వబద్ధాలాడతావని కల్లోకూడా ఎవరూ అనుకోరు."

"నువ్వు నమ్మవేమోగాని కల్లోకూడా అబద్ధం చెప్పరాదే అని మీ అన్నయ్య అంటారు. అసలు బయటవాళ్ళు చెపుతుంటేనే ఒళ్ళంతా కంపరంగా వుంటుంది." మగవాళ్ళు రావడంతో ఆ సంభాషణ అంతటితో ఆగింది.

రోజులు ముభావంగా గడుస్తున్నాయి. ఆ యింట్లో కూర గిన్నెలీ యింట్లోకి ఈ ఇంట్లో పిండివంట లా యింట్లోకి. పరిగెత్తడం మానేశాయి. వదినగారూ అన్న పల్కరింపులూ. సున్నిత హాస్యాలూ అడుగంటాయి. పిల్లలు మాత్రం అమాయకంగా ఆడుకుంటూనే వున్నారు ఎవరిదార్న వాళ్ళె సినిమాలు చూసొస్తున్నారు. ఎదురు పడినప్పుడు. మాత్రం విడీ విడని చిరునవ్వులు, వంటయిందా లాంటి ముభావం పల్కరింపులూ బంధాలు పూర్తిగా తెగ లేదంటున్నాయి.

వున్నట్లుండి ఓ మధ్యాహ్నం "పడుకున్నావా కమలా?" నోరంతాతెరిచి ఆప్యాయంగా పల్కరిస్తూ వచ్చింది జానకి.

"రా వదినా మధ్యాహ్నాలు నిద్రపోనుగా వూరికే పడుకున్నా నీరసంగా వున్నట్టుంటే."

"నీరసమా మళ్ళీ ఏమైనా....?" సంతోషంగా అంది.

'విశేషం లేదూ. పాడూ లేదు.'

'అయితే డాక్టరుకి చూపించుకో.' మాటల్లో ఆపేక్ష వెల్లివిరిసింది.'

"నువ్వసలే అలిపిరిదానివి. ఆ రంగి ముండమానెయ్యడంతో అన్నిపన్లూ చేసుకోబోయేసరికి నిస్సత్తువగా వుంది. ఎక్కడో చిన్నపిల్ల వుందిట. చలాకీగా అన్ని పన్లూ చేస్తుందిట. డాన్ని కుదురుస్తానుండు. అన్నట్లు ఈమాట విన్నావా?" అనుమానంగా చూసింది కమల.

"కామాక్షి మిడిసిపాటు ఏం చెప్పను. తెల్లగా వున్నావనీ. డబ్బెక్కువనీ నీకు

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డ్ అందుకొన్న
వాసికెక్కిన రచయిత్రి
శ్రీమతి సి. ఆనందారామం గారికి
మా హార్దిక అభినందనలు !
జేలక్ష్మి పబ్లికేషన్స్
ఏలూరు రోడ్ * విజయవాడ-520 002

విజయా B.Ed కాలేజి
గూడూరు, నెల్లూరు జిల్లా.
(అన్నామలై యూనివర్సిటీ B.Ed., కరస్పాండెన్సు
కోర్స్ కోచింగ్ ఇన్స్టిట్యూట్)
1980-81 సం॥నకు అడ్మిషన్లు ప్రారంభమయినవి
మా కాలేజి నుండి పోవు రెండవ బ్యాచ్
అర్హత : B.A., B.Sc, B.Com. or M.A., M.Com.,
వయస్సు : పరిమితి లేదు.
కోర్సు : ఒక సంవత్సరము. పోస్టలు/ఓరలు కోచింగు కలవు.
A) EXAMINATION CENTRE : NELLORE.
B) TEACHING PRACTICE : TELUGU MEDIUM.
C) SEMINORS : 5 DAYS PLACE : NELLORE.
D) Teachersగా పని చేయువారికి ప్రత్యేక సదుపాయములు కలవు.
Application మరియు Prospectus కొరకు Rs. 2-50 M.O.చెయ్యండి.
ఏలూరు (పశ్చిమ గోదావరిజిల్లా) లో మా Coaching Centre (ఓరల్/పోస్టలు) త్వరలో ప్రారంభించుచున్నాము. ప్రస్తుతం Admissions (ఏలూరుకు కూడా) పై అడ్రసుతో చేసుకొనండి.
G. Hari Krishna Prasad M. Com.
Principal

**ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక**

**చందా రేట్లు**

| | ఏజెంటు ద్వారా | పోస్టు ద్వారా |
|---|---|---|
| 3 నెలలకు | 11–70 | 12–35 |
| 6 నెలలకు | 23–40 | 24–70 |
| 12 నెలలకు | 46–80 | 49–40 |

విడి ప్రతి వెల 0.90 పైసలు

సర్క్యులేషన్ మేనేజరు,
ఆంధ్రజ్యోతి,
P.B. No. 712, విజయవాడ-10.

**సినీ క్విజ్ పోటీ**

తెలుగు సినీ క్విజ్ పోటీ నెం–1 లో పాల్గొని రూ. 5,000 లు నగదు బహుమతులు గెలవండి! పోటీలో పాల్గొన్న సభ్యుల్లో ప్రతి నెలలో 5గురికి ఉచితంగా బెంగుళూరు నగర పర్యటన అవకాశం!! ఉచిత ఎంట్రీల కొరకు 30 పై. స్వంత చిరునామా కవరుతో వెంటనే వ్రాయండి.

విజయా బుక్ వరల్డ్,
40/1 ఏ.వి.రోడ్డు, బెంగుళూరు-2.

**ఇంటివద్ద నేర్చుకోండి**

వ్యాపార అక్కౌంటులు, 3 మాసముల పోస్టల్ ట్యూషన్. నెలకు రు. 10/–లు ఫీజు. సర్టిఫికెటు ఇవ్వబడును. ప్రాస్పెక్టసు ఉచితం.

Imperial Institutes (ND)
Doriwalan,
New Delhi-110 005.

**తెల్ల వెంట్రుకలు**

భారతదేశంలో ప్రఖ్యాతిగాంచిన మా ప్రత్యేకమైన సువాసనగల నూనె వాడినందువల్ల తెల్లని లేదా నెరసిన వెంట్రుకలు నల్లగా మారనిచో సొమ్ము వాపసు చేయబడును. మూడు సీసాల పూర్తి కోర్సు ధర రు. 30/- ఇంగ్లీషు లేదా హిందీలో ఉత్తరం వ్రాయండి. మరియు అడ్వాన్సుగా పోస్టేజి కోసం 10 రూపాయలు పంపండి. చిరునామా :

BIMLA AYURVED BHAWAN
P.o. Lal Bigha (NAWADA)


గర్వంటా!" కమల మొహం ఎర్రబడింది. "విశ్వనాథంవంక ఎలాగో చూస్తావుట. ఒక మాటా, రెండు మాటలా? ఎన్నని చెప్పేది. నీ బాగుకోరి చెప్తున్నాను. నీ జాగ్రత్తలో నువ్వుంటావని. కమలకి నోట మాటరాలేదు. కన్నుల్లో నీళ్ళు గిర్రున తిరిగింది.

"అంతమాటందా కామాక్షి? నిజమేనా?" "అయ్యోకమలమ్మతల్లీ అబద్ధాలు చెప్పటం మా యింటా వంటా లేదు. మాష్టార్ని చూస్తున్నావుగా.... నువ్వసలే అమాయకురాలివి ఈ సంగతి శేఖర్‌కి చెప్పకు. మగాళ్ళు అనుమానస్తులు" మొహం చిట్లించింది కమల.


"నన్నెంత అవమానం చేసిందో విను మరీ- రేపు మా చుట్టాలమ్మాయి పెళ్ళి ఈ వూళ్ళోనే. కామాక్షీ నెక్లెస్ ఓ మాటియ్య నానుతాడు పెరిగిపోయింది, అన్నాను. మొహం చెండుకుంటూ అంది. 'కొక్కెం విరిగిపోయింది వదినా' అంటూ. అయ్యో కమలనైనా అడక్కపోతినే అని వూహా యిదయ్యాను. కమల దెంత మంచి మనసు. ఈ కుళ్ళు దాన్నడిగి లేదనిపించుకున్నానే అని యెంత బాధపడ్డానో భగవంతుడికే తెలియాలి." కమల మాట్లాడకుండా మెళ్లో గొలుసు తీసిచ్చింది. "నే చెప్పినమాట కామాక్షికి చెప్పకు లేనిపోని తంటాలు." తలుపు చేరేసి వెళ్ళింది. శేఖర్ వచ్చేదాకా ఏడుస్తూ అలానే కూర్చుండిపోయింది. "అప్పుడుమాటలు వినడం తప్పు డియర్" అంటూ వోదార్చేసరికి తలప్రాణం తోక్కొచ్చింది శేఖర్‌కి. "ఆ విశ్వనాథం పెద్ద అందగాడని చూస్తావా? పెళ్ళయి పిల్లలున్న సంసార స్త్రీలెవరూ అలాంటి పనులు చెయ్యరు. ఎవరో ఏదో వాగారని మన మనసులు పాడుచేసుకుంటామా?" తెల్లవార్లూ విసుగులేకుండా నచ్చచెప్తూనే వున్నాడు కమలకి.

భర్త ఓదార్పుతో కమల మనసు కొంతవరకు ఉపశాంతి పొందిన, కామాక్షిని చూసేసరికి ఆవేశం బుసలు కొట్టేది. నాలుగూ అడిగేద్దామా అనిపించేది. అయినా సంస్కారమూ, సభ్యతా నోటికి తాళం పెట్టగా మొహం తిప్పుకుని. గిరుక్కున లోపలికి వెళ్ళిపోయేది.

కామాక్షికీ కమలని చూస్తూంటె కోపంగానే వుండేది. కాకిమీదా పిల్లిమీదా పెట్టి సూటీ పోటీ మాటలనేది. కమలని చూస్తూ పిల్లలని అన్నట్లుగా ఒసే కోతిమొహమా ముచ్చులాగా చూస్తావేమే అనో. దేభ్యం మొహమా అంత గర్వమెందుకే అనో అని అంటుంటే కమల కోపంతో ఉడికిపోయేది. మొదట చెప్పినట్లు మర్నాడే గొలుసు తెచ్చివ్వలేదు. పెళ్ళివారు బలవంతం చేస్తే అక్కడే వుండిపోయింది జానకి.

మూడో రోజు ఎనిమిదింటి కొచ్చింది. అప్పుడు కమల మంచి పని ముమ్మరంలో వుంది. పిల్లలకి నీళ్ళూ, జళ్ళూ చూసి వాళ్ళకు అన్నాలు పెట్టి, మధ్యాహ్నానికి కారేజుల్లో పెట్టాలి. శేఖర్‌కి టిఫిన్ కట్టి భోజనం వడ్డించాలి. వంటింట్లో అష్టావధానం చేస్తోంది. "ఇదిగో కమలా నీ గొలుసు. నీది నీకు తెచ్చిచ్చేదాకా మనస్థిమితం లేదనుకో. ఎరువు సొమ్ము బరువు చేటని. యెందుకు తెచ్చానా అని ఒకటే యిదయి పోయాననుకో"

"పరవాలేదులే వదినా అంత యిదవుతావేం?" కమల మాట పోపు



ఘాటు మోతతో కల్సిపోయింది. "ఇదిగో అలమర్లో పెడ్తున్నాను. చెయ్యి తీరికకాగానే తీసుకోనే వస్తా" అంటూ వెళ్ళిపోయింది జానకి. ఆ పనీ ఈ పనీచేసి పని పూర్తయ్యాక అలసటతో నిద్ర ముంచుకొచ్చింది కమలకి. మెళుకువ వచ్చాక గొలుసు సంగతి గుర్తుకొచ్చి అలమర దగ్గరికి పరిగెత్తింది. ఎక్కడా లేదు. గుండె గుభేలుమంది. ఆదుర్దాగా సీసాలు, పొడరుడబ్బాలూ, కాయితాలు అలమరంతా దులిపేసింది. ఫలితం శూన్యం. గట్టిగా ఏడవడానికూడా మనసు పనిచెయ్యలేదు. మొద్దుబారిపోయింది. పది తులాలు. ఎన్ని జన్మలెత్తినా చేయించుకోలేదు! తులం వెయ్యిరూపాయల పైమాటే. బొమ్మలాగా కూర్చుండిపోయింది.

శేఖర్ మంచివాడే. అయినా ఇంత నష్టం! కోపం ముంచుకొచ్చింది "వెంటనే చూసుకోరా? అంత నిర్లక్ష్యమా? మన జాగ్రత్తకు తగినట్లుగా అయింది. పీడా పోయింది. ఇంకా దాచుకోవల్సిందేం లేదు." చిందులు తొక్కాడు శేఖర్. "పొద్దుట్నించీ గదిలోకి ఎవరూ రాలేదు. అసలు పెట్టిందోలేదో వెళ్ళి అడిగొస్తా."

"పిచ్చిమొహమా పెట్టలేదని మళ్ళీ తెచ్చిస్తుందా. కోర్టుకెక్కినా గెలవం. మనకి సాక్ష్యమేది? మన తెలివి తక్కువకి మనమే అనుభవించాలి." కమల గొల్లుమంది. తల్లితో పిల్లలూ గొంతు కలిపారు- ఆ సందడికి కామాక్షి తొంగి చూసింది. ఎన్నిరోజులైందో ఆ గడపలో అడుగుపెట్టి "ఏమిటి కమలా" అంటూ. దుఃఖం ఆపుకోలేక అంతా చెప్పి భోరుమంది. "అంత పని చేసిందా జానకొదిన!"

"ఆనాడు రంగి, ఈనాడు నేను మోసపోయాం. ఆవిడ సత్యసంధురాలు. అబద్దాలాడితే ఒళ్ళుమంట లెత్తుతుంది. తన్నితనే తిట్టుకోటం మొదలుపెట్టింది కమల. కామాక్షి ఓదార్చి కాఫీకాచి అందరికీ యిచ్చింది. విశ్వనాధంకూడా వచ్చాడు. "అవునూ మా కోమలి కాకిలా వుంటుందన్నావుట. రవి ఒంకి నక్కలాగా వుంటాడన్నావుట కదా కమలా?"


"సత్యసంధురాలేనా అలా చెప్పింది?" శేఖర్ అడిగాడు.

"అవును ఎన్నో అన్నారని చెప్పింది. గొలుసు గొడవ వింటుంటే ఇందులో ఏదో తిరకాసున్నట్లనిపిస్తోంది" అంది కామాక్షి. "మీరూ చాలా చాలా మా కమలని అన్నారని జానకమ్మగారు చెప్పింది." అన్నాడు శేఖర్. కామాక్షితో మాట్లాట్టం అంత అలవాటు లేకపోయినా.

"రామరామ" తెల్లబోయింది కామాక్షి. మనసులో కబుర్లన్నీ కలబోసుకున్నారు. "నేనలా అనలేదు కామాక్షీ" "నేను మాత్రం ఇలా అంటానా కమలా" "మరీ అంత నీచురాలా!" "సంఘవిద్రోహి" "కాపురాలు కూలత్రోసే చీడపురుగు" "తడిగుడ్డతో గొంతుకోసే రకం" ఎన్నో అనుకున్నారు. మనసుల్లో మబ్బు తొలగిపోయింది. "నువ్వేనన్నా అనవయ్యా శేఖర్ ఇట్లాంటి వాళ్ళని వెలివెయ్యాలి. వాళ్ళ గడప మనం తొక్కకూడదు మన చాయలకి వాళ్ళని రానీకూడదు."అన్నాడు విశ్వనాథం. "నీ కింకో కొత్త న్యూస్ చెప్పనా కామాక్షీ. విరుచుకు పడకు. సత్యంమాషారు నాకు మూడొందలదాకా టోకరా యిచ్చాడు."

"అడగలేకపోయారా భయందేనికి." శేఖర్ సలహా. అప్పుడు ఓ పాతిక అప్పుడో పదీ యిచ్చి ఆరొందలు తీర్చాననాడు. అడుగుదామంటే సత్యాన్ని గురించీ నీతి గురించీ ఓ గంట క్లాస్ తీసుకుని ప్రాణం తోడేసాడని భయపడి మూడొందలకీ నీళ్ళొదిలాను. మంచిరోజు చూసి నువ్వులతోకూడా వదుల్తాను."

పత్యం మాష్టారు పదిరోజుల తర్వాత సత్యనారాయణవ్రతం చేసుకుంటున్నామని సతీసమేతంగావచ్చి ఆహ్వానించారు. రెండు కుటుంబాల్నీ. వ్రతానికి పిలిస్తే మానకూడదని కమలా, కామాక్షీ వెళ్ళారు. "ఇదుగో కామాక్షీ, మా అమ్మ ముగ్గురికీ మూడు వొంటిపేట గొలుసులు చేయించి తెచ్చింది." కొత్త గొలుసులు తళా తళా మెరుస్తుంటే కమల మొహం వెలా తెలా పోయింది. "మూడు గొలుసులూ మూడు మూళ్లు తొమ్మిది తులాలేగా? ఇంకోతులం ఏమైందో?" కామాక్షి గుసగుస. ఆ తులంతో సత్యంమాష్టారు సత్యనారాయణుడి విగ్రహం వేసి ఉంగరం చేయించుకుని వుంటారు." కమల ఏడ్వలేక నవ్వుతూ అంది. ●



# మల్లెపందిరి

## కాకుల్లో కోకిల

వరమిహ రవితాపైః కిం న శీర్ణాసి గుల్మే
కిము దవదహనైర్వా సర్వదాహం న దగ్ధా।
యదహృదయ జనౌఘైర్వ్యాంతపర్ణా నభిజ్ఞైః
ఇతర కుసుమ మధ్యే మాలతి ప్రోజ్ఝితాసి॥

—భట వల్లటుడు

ఒక శ్రేష్ఠుడు శ్రేష్ఠ గుణాలతో శోభిస్తుంటే. ఆ గుణాలను గుర్తించలేని కొందరతణ్ణి హీన గుణులమధ్య వదిలేశారు. ఆ పరిస్థితికి కవి ఇలా శోకిసున్నాడు:

ఓ మాలతీలతా, నీ గుబురులోనే నీవు ఎండకు ఎందుకు వాడి వత్తలై పోలేదు? అరణ్యపు మంటల్లో పూర్తిగా ఎందుకు కాలిపోలేదు? నీ ఆకులను, తొడిమలను గుర్తించలేని కొందరు హృదయంలేనివారిచే నీ విలా ఇతర పుష్పాల మధ్య విడువబడ్డావు- ఆ విధంగా జరిగివుంటే ఈ అవస్థ వుండేది కాదుకదా. మూల్యం తగ్గిపోవడంకంటే నాశం పొందడమే మేలు. నాశం పొందితే అవమానంలేదు. మరణం కంటె అవమానం ఎక్కువ పీడాకరం.

—సౌభరి